
సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 19 । మార్చి । 2024



దిగి వచ్చిన ఓఎన్‌జీసీ

కాకినాడ సముద్ర తీరంలో నిర్వహిస్తున్న డ్రిల్లింగ్‌తో మత్స్యకారులకు కలుగుతున్న నష్టంపై ఓఎన్‌జీసీ దిగి వచ్చింది.

- వివరాలు 8లో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.22	4.48
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

న్యూస్‌రీల్

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



రఘుదేవపురం విద్యార్థి నాగేంద్రకుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు జరిగాయి. వీటిలో కొవ్వూరు మండలం ఐ.పంగిడి జెడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి బోయిశెట్టి లక్ష్మణ్ మల్టీపర్పస్ వ్యవసాయ పరికరాన్ని ప్రదర్శించాడు. అలాగే, సీతానగరం మండలం రఘుదేవపురం జెడ్పీ హైస్కూలు 7వ తరగతి విద్యార్థి కేఎస్‌డీ నాగేంద్ర కుమార్ హ్యాండ్‌మేడ్ కోకోనట్ పిల్లర్ ప్రదర్శించాడు. ఈ రెండు ప్రదర్శనలు ప్రథమ స్థానంలో నిలిచి, అక్టోబర్‌లో జరిగే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యార్థులు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస నెహ్రూ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామారావు, శ్యామల, గైడ్ టీచర్లు రాజు, శేఖర్ సహకారంతో కలెక్టర్ మాధవీలతను సోమవారం రాత్రి ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలు చేసి మరింత మందికి స్ఫూర్తినిచ్చారని విద్యార్థులను ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మందిని ఇదేవిధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు.



ఐ.పంగిడి విద్యార్థి లక్ష్మణ్‌ను ప్రశంసిస్తున్న కలెక్టర్

రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్లొద్దు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల నేపథ్యంలో ప్రజలు రూ.50 వేలకు మించి నగదును వెంట తీసుకుని వెళ్లవద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్తే తనిఖీ అధికారులకు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు తగిన ఆధారాలు చూపాలని తెలిపారు. లేకుంటే ఆ నగదును సీజ్ చేస్తారన్నారు. అలాగే, ఎవరైనా రూ.10 లక్షలు పైబడి తీసుకుని వెళ్తే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆ మొత్తాన్ని సీజ్ చేస్తాయని, తగిన ఆధారాలు చూపిస్తే విడుదల చేస్తారని తెలిపారు. విమానాశ్రయం, హెలిప్యాడ్‌లలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు బ్యాగేజీల స్క్రీనింగ్, ఫిజికల్ చెకింగ్ నిర్వహిస్తారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారీ మొత్తంలో సీజ్ చేసిన నగదు, వస్తువులు, మద్యం వంటి వాటికి సంబంధించిన నివేదికలను 24 గంటల్లోపు అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ ఏజెన్సీలను కలెక్టర్ ఆదేశించారు.

సార్వత్రిక సంగ్రామానికి.. సర్వ సన్నద్ధం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన
- నగదు, మద్యం అక్రమ రవాణాపై డేగకన్ను
- 'సాక్షి'తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ముఖాముఖి



రాజకీయ నాయకులతో ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ (ఫైల్)



పోలింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ (ఫైల్)



సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలే పాలకులను ఎన్నుకునే అత్యుత్తమ విధానమే ప్రజాస్వామ్యం. అలా అధికారంలోకి వచ్చిన పాలకులు జనరంజకంగా పరిపాలన సాగిస్తే.. ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తే.. వారి బాగోగులు పట్టించుకుంటే.. వారికి కష్టం వచ్చినప్పుడు చలించిపోయి అండగా నిలిచి 'నేనున్నాను' అంటూ భరోసా ఇస్తే.. వారికే ఆ జనం తిరిగి పట్టం కడతారు. అలా కాకుండా మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి, మోసం చేసే వారిని తిప్పికొడతారు. దీనికి వారి చేతిలో ఉన్న ఆయుధమే ఓటు. అటువంటి ఓటు ద్వారా తమకు మేలు చేసే పాలకులను ప్రజలు మళ్లీ ఎన్నుకునే తరుణం మరో 56 రోజుల్లో రానుంది. రాష్ట్రంలోని శాసనసభ, లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ అంటేనే మహాయజ్ఞం. సుశిక్షితులైన వేలాది మంది అధికారులు, సిబ్బంది, పోలీసులు ఈ యజ్ఞంలో పాలు పంచుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత 'సాక్షి'తో ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

అన్ని ఏర్పాట్లూ పూర్తి

ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడమే మా ముందున్న కర్తవ్యం. ఇందుకు అన్ని ఏర్పాట్లూ ఇప్పటికే పూర్తి చేశాం. పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశాం. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి

జిల్లాలోని ఒక లోక్‌సభ, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధిలో ఎన్నికల ప్రక్రియ చేపట్టేందుకు 8 మంది రిటర్నింగ్ అధికారులను నియమించాం. వీరితో పాటు మరో 27 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల్లో భాగస్వాములు కానున్నారు. 441 మంది మైక్రో అబ్జర్వర్లు, 11,354 మంది పోలింగ్ సిబ్బందిని నియమించాం. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మొత్తం 213 బృందాలు పాటుపడనున్నాయి. ప్రిసైడింగ్ ఆఫీసర్లతో పాటు సెక్టార్ ఆఫీసర్ల నియామకం పూర్తయ్యింది. వీరందరికీ ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చాం. ఎన్నికల నియమావళిని వివరించాం.

1,577 పోలింగ్ కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 16,08,504 ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరి కోసం 1,577 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిని 151 రూట్లుగా విభజించాం. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది, ఓటర్లకు అవసరమైన అన్ని వసతులూ కల్పించాం. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు వాహనాలు సిద్ధం చేశాం. అబ్జర్వర్లు, లైజనింగ్ అధికారులకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం.

పక్కాగా ఎన్నికల కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులోకి వచ్చింది. దీనిపై అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. రాజకీయ నాయకులకు అవగాహన కల్పించాం. కోడ్ పక్కాగా అమలు చేసేందుకు 23 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలను రంగంలోకి దింపాం. వ్యక్తిగతంగా రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్లేందుకు ఏ ఒక్కరికీ అనుమతి లేదు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తాలు తీసుకుని వెళ్తే సీజ్ చేస్తాం. ప్రతి ఘటననూ వీడియో తీస్తాం. ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రకటనలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురించే, ప్రసారం చేసే అన్ని ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అమలయ్యేలా ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి

జిల్లావ్యాప్తంగా 367 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. వీటిలో ప్రజలు ప్రశాంతంగా ఓటు వేయగలిగేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పోలీసు బలగాలతో కవాతు నిర్వహించాం. జిల్లా ఎస్పీ, పోలీసులు ఆయా గ్రామాల్లో పర్యటించి దిశానిర్దేశం చేశారు. రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులున్న వారికి నోటీసులు జారీ చేశాం.

సీసీ కెమెరాలతో నిఘా

ప్రతి ఘటనా కళ్ల ముందు ఉండేలా 822 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. పోలింగ్ కేంద్రాలన్నింటినీ నిఘా నీడలోకి తీసుకుని వస్తున్నాం. తద్వారా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా ఎన్నికల సంఘం నేరుగా స్పందించేలా ఇవి ఉపయోగపడతాయి.

ఓటింగ్ శాతం పెంచేలా..

రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం కలిగిస్తున్నాం. తద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగులు సజావుగా ఓటు వేసేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేశాం.

ఈవీఎంల భద్రతకు ప్రాధాన్యం

జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను గోడౌన్‌లో భద్రపరిచాం. వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేస్తున్నాం. ఈవీఎంలపై శిక్షణ నిమిత్తం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు 18 చొప్పున బ్యాలెట్ యూనిట్లు అందజేస్తాం. వీటిని ఆయా నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచి, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం తీసుకువస్తాం.

రాజకీయ నేతలతో సమావేశాలు

ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించాం. వారి అభ్యర్థనలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, తుది జాబితా, ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాం. మీడియా ప్రతినిధులకు సైతం ఎన్నికల నియమావళి, అమలుపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాం.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తం

ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలపై నిఘా ఉంచాం. అక్రమ నగదు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజానగరం సమీపంలోని తూర్పు గోనగూడెం, కొవ్వూరు ప్రాంతాల్లో ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు	మొత్తం ఓటర్లు
అనపర్తి	228	67	2,24,222
రాజానగరం	216	40	2,14,393
రాజమహేంద్రవరం సిటీ	237	71	2,61,757
రాజమహేంద్రవరం రూరల్	267	56	2,72,158
కొవ్వూరు	176	35	1,83,301
నిడదవోలు	205	41	2,11,796
గోపాలపురం	248	57	2,40,877

టెన్త్ పరీక్షలు ప్రారంభం

- 94.5 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ, విద్యా శాఖ అధికారులు



రోల్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



దానవాయిపేట నగర పాలక సంస్థ పాఠశాలలో పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రథమ భాష తెలుగు పరీక్ష నిర్వహించారు. దీనికి ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు కలిపి 30,116 మంది హాజరు కావాల్సి ఉంది. రెగ్యులర్‌గా 25,399 మంది హాజరు కావాల్సి ఉండగా, వీరిలో 23,998 మంది (94.5 శాతం) పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 1,401 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 137 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరిగింది. వీటిని కలెక్టర్ కె.మాధవీలతతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు. మొత్తం 1,567 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 42 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదు.





పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్, కలెక్టర్ మాధవీలత

కలెక్టర్ తనిఖీ

రాజమహేంద్రవరం కంబాలపేటలోని చున్నీలాల్ జాజు మున్సిపల్ హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ మాధవీలత తనిఖీ చేసారు. విద్యార్థులకు అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నాయో లేవో పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. స్క్వాడ్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పరీక్షల నిర్వహణను గమనించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్ నిరోధానికి అన్ని చర్యలూ తీసుకున్నామని చెప్పారు.

ఎస్పీ పరిశీలన

ఎస్పీ పి.జగదీష్ కూడా వివిధ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష హాలులోనికి విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుని వెళ్లకుండా పోలీసు సిబ్బంది తనిఖీలు చేస్తున్నారని, పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసివేయించామన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకూ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు.

ఇంటి నుంచే ఓటు

- మొబైల్ ఓటింగ్ వాహనంతో ఈ అవకాశం
- ఎన్నికల కమిషన్ నూతన విధానం
- ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం
- పోలింగ్ శాతం పెంపునకు విస్తృతంగా చర్యలు



కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మే 13న మన రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా సవరణలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచేందుకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ఈసారి సరికొత్త కార్యక్రమానికి ఎన్నికల యంత్రాంగం శ్రీకారం చుట్టింది. పోలింగ్ కేంద్రాలకు రాలేని దుస్థితిలో ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులకు హోమ్ ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు వేయడం) విధానాన్ని రానున్న ఎన్నికల్లో అమలు చేస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేయగా, ఇప్పుడు మన రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దివ్యాంగులు, వయోవృద్ధులు ఎన్నికల కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు గతంలో నానా ఇబ్బందులూ పడేవారు. తాజా నిర్ణయంతో వీరికి ఈ కష్టాలు తొలగనున్నాయి. హోమ్ ఓటింగ్ కోసం మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న వారు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు దీని ద్వారా అవకాశం కలగనుంది. అయితే, పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోమ్ ఓటింగ్‌కు కూడా ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌ఓ) కూడా ఇంటి నుంచే ఓటు వేయడానికి అర్హులైన వారిని సంప్రదించి, వారి ఆసక్తికి అనుగుణంగా దరఖాస్తు చేయిస్తారు. జిల్లాలో ఇప్పటికే ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గాలు	: 7
మొత్తం ఓటర్లు	: 15,99,065
పురుషులు	: 7,88,105
మహిళలు	: 8,10,781
ఇతరులు	: 179
దివ్యాంగ ఓటర్లు	: 17,716
85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు	: 7624
వందేళ్లు నిండిన వారు సుమారు	: 15

నియోజకవర్గాల వారీగా 85 ఏళ్లు పైబడిన ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
తుని	300	618	918
ప్రత్తిపాడు	316	685	1,001
పిఠాపురం	306	547	853
కాకినాడ రూరల్	795	873	1,668
పెద్దాపురం	363	589	952
కాకినాడ సిటీ	518	635	1,153
జగ్గంపేట	387	692	1,079
మొత్తం	2,985	4,639	7,624

ఫారం–12డీతో దరఖాస్తు

- దివ్యాంగులు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఫారం–12డి ద్వారా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బీఎల్‌ఓల ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ)కి దరఖాస్తు చేసుకోవాలి. దీనిని పరిశీలించిన అనంతరం అర్హులైన వారి జాబితాను ఈఆర్‌ఓ స్థాయిలో రూపొందిస్తారు.
- ఫారం–12డి దరఖాస్తు చేసుకున్న ఓటరుకు ఏ రోజు ఓటు వేయాలో ముందుగానే అధికారులు సమాచారం ఇస్తారు.
- మొబైల్ ఓటింగ్ వాహనం ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని వారికి కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు.
- ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు మాత్రమే..

వృద్ధులకు ఎంతో మేలు



పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసే ఓపిక లేక ఎంతో మంది వృద్ధులు ఎన్నికల్లో ఓటు వేయలేకపోతున్నారు. వ్యయప్రయాసలు తట్టుకోలేక ఓటు వేయకపోతే ఏమీ నష్టం లేదనే భావనతో ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. నడవలేక చేతికర్రల సాయంతో గడుపుతున్న వారికి, పెద్ద వయస్సు వారికి ఇంటి నుంచే ఓటు వేసే విధానం చాలా మంచి నిర్ణయం. మాలాంటి వృద్ధులకు ఇది ఎంతో ఉపయోగకరం.

– వడ్డి ఏసు ప్రభువు, ఉండూరు, సామర్లకోట మండలం

ఈ నిర్ణయం అభినందనీయం



దివ్యాంగుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచే ఓటు వేసే విధంగా మొబైల్ ఓటింగ్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకుని రావడం అభినందనీయం. దీనివలన దివ్యాంగులు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. శరీరం సహకరించని చాలా మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు.

– నరాల వీరబాబు, సాంబమూర్తి నగర్, కాకినాడ

ఇంటి వద్దనే ఓటు వేసేలా చర్యలు



దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కొంత మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. అటువంటి వారు ఇంటి వద్దనే ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. అర్హత కలిగిన వారు ఫారం–12డి ద్వారా బీఎల్‌ఓలకు దరఖాస్తులు అందించాలి.

– కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


కొవ్వాడలో వ్యక్తి మృతదేహం

కాకినాడ రూరల్: కొవ్వాడ గ్రామంలోని సాయి బాబా ఆలయ సమీపంలో అలంకార్ గార్డెన్ ఎదురుగా సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఇంద్రపాలెం పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఒంటిపై ఖాకీ రంగు చొక్కా, నీలం నైట్ ప్యాంటు ఉన్నాయి. ఫిట్స్ వచ్చి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. చొక్కాపై గౌతమ్ అని ఇంగ్లిష్ అక్షరాలతో రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై మణి కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96555 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతూ..

దేవరపల్లి: దేవరపల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్న ప్రాంతం దగ్గరలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, 94407 96624 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నరసన్న ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 25 వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు
- నేడు పుట్టమన్ను సేకరణ
- పూర్తయిన ఏర్పాట్లు


కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమైంది. అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 25 వరకూ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక దేవుని కోనేరులో పుట్టమన్ను సేకరిస్తారు. అనంతరం అంకురార్పణం, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ నిర్వహిస్తారు.

20న రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. ఆ రోజు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. ఉత్సవ విగ్రహాలను మధ్యాహ్నం 1.39 గంటలకు పల్లకీపై తీసుకువెళ్లి రథంపై ఆశీనులు చేస్తారు. సన్నాయి, బ్యాండుమేళాలు, కోలాటం, తీన్‌మార్, గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణల నడుమ కోరుకొండ ప్రధాన వీధుల్లో రథంపై స్వామి, అమ్మవార్లు విహరిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మంగళస్నానాలు నిర్వహించి, పట్టువస్త్రాలను అలంకరించి, వధూవరులుగా పెళ్లి పీటలపై కూర్చోబెడతారు. స్వామివారి కల్యాణ మంటపంలో వైఖానస ఆగమ శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం కల్యాణం నిర్వహిస్తారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజ బట్టర్, వేద పండితులు పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుంది.

వైభవంగా గ్రామోత్సవాలు

ఉత్సవాల సందర్భంగా ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. గరుడ, ఆంజనేయ, గజ, శేష వాహనాలపై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి వేళల్లో స్వామివారి కల్యాణ మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. స్వామివారి కోనేటిలో 24న చక్ర తీర్థం కార్యక్రమం నిర్వహిస్తారు. 25న జరిగే శ్రీ పుష్పయాగంతో కల్యాణోత్సవాలు పూర్తవుతాయి. అలాగే 23వ తేదీన శ్రీరంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది.

భక్తులకు భోజన సదుపాయం

రెడ్డి పంతులు సత్రంలో భక్తులకు భోజనం సౌకర్యాలు కల్పించారు. ఉత్సవాల ముగింపు వరకూ నిత్యం ఉదయం, రాత్రి సమయంలో అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈఓ పాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

ఏర్పాట్లను పరిశీలించిన అన్నవరం ఈవో


సిబ్బందికి సూచనలిస్తున్న అన్నవరం ఈవో రామచంద్ర మోహన్

మధురపూడి: అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ సోమవారం కోరుకొండలో స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని వసతులూ కల్పించాలని ఆదేశించారు. కొండపైన, కింద తాగునీరు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అన్నవరం దేవస్థానం డీసీ డీఎల్‌వీ రమేష్ బాబు ఉన్నారు. అలాగే నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనంద కుమార్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తులకు అన్ని వసతులు



కోరుకొండ తీర్థానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులూ కల్పించాం. తాగునీరు, వైద్యశిబిరాలు, విద్యుత్, అంబులెన్సులు ఏర్పాటు చేశాం. దేవదాయశాఖకు చెందిన ఉద్యోగులు, సిబ్బందితో పాటు అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందిని నియమించాం. ఇతర ప్రాంతాల నుంచి అర్చక స్వాములను తీసుకువస్తున్నాం. రథోత్సవాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభిస్తారు.

– డీఎల్‌వీ రమేష్ బాబు, డిప్యూటీ కమిషనర్, అన్నవరం దేవస్థానం

వైభవంగా ఉత్సవాలు



స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ చేశాం. భక్తులకు సదుపాయాలు కల్పించడంతో పాటు మిగిలిన జాగ్రత్తలు తీసుకున్నాం. రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కండే శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనంద కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. పారిశుధ్య చర్యల్లో భాగంగా కార్మికులను పెద్దసంఖ్యలో తీసుకువస్తున్నాం.

– తాడి రజనీ రెడ్డి, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు

దిగివచ్చిన ఓఎన్‌జీసీ

- నష్టం అంచనాకు నిపుణుల కమిటీ
- సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు
- యువతకు నైపుణ్య శిక్షణ
- ఫలితాన్నిచ్చిన మత్స్యకారుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ సముద్ర తీరంలో నిర్వహిస్తున్న డ్రిల్లింగ్‌తో మత్స్యకారులకు కలుగుతున్న నష్టంపై ఓఎన్‌జీసీ దిగొచ్చింది. ఓఎన్‌జీసీ కాకినాడ ఆఫ్‌షోర్‌లో సిస్మిక్ సర్వేకు సిద్ధమవుతోన్న నేపథ్యంలో జీవనోపాధి కోల్పోతామంటూ మత్స్యకారులు ఈ నెల రెండో తేదీ నుంచి దఫదఫాలుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. తమకు నష్ట పరిహారం అందించాలనే ప్రధాన డిమాండ్‌తో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మత్స్యకారులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఓవైపు లంగరు రేవు వద్ద నిరసన కొనసాగిస్తూనే, ఓఎన్‌జీసీ కార్యకలాపాలను స్తంభింపజేస్తూ కాకినాడ రూరల్ వాకలపూడిలోని ఓఎన్‌జీసీ ప్రాంతీయ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఆందోళనల నేపథ్యంలో ఓఎన్‌జీసీ ఉన్నతాధికారుల బృందం సోమవారం కాకినాడ వచ్చింది.

కలెక్టరేట్‌లో సమావేశం

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సమక్షంలో మత్స్యకార సంఘాల ప్రతినిధులతో మత్స్యశాఖ అధికారులు, ఓఎన్‌జీసీ సంస్థ ఉన్నతాధికారులు కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. సముద్రంపై వేట చేయడమే తమ జీవనోపాధి అని, అదే తమ కుటుంబాలకు ఆధారమని మత్స్యకార ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేట లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో మత్స్యకారులకు ఇస్తున్న తరహాలోనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుని, న్యాయం చేసేందుకే ఇక్కడకు వచ్చామని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు తెలిపారు. డ్రిల్లింగ్‌తో జరిగే నష్టాన్ని అంచనా వేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఓఎన్‌జీసీ సర్వే జూలై నెలాఖరుకు పూర్తవుతుందని, ఈ సర్వే ప్రభావంతో కలిగే నష్టాన్ని అంచనా వేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా మత్స్యకార ప్రతినిధులు, అధికారుల సమక్షంలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు

సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చిన ఓఎన్‌జీసీ అధికారులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలకు మత్స్యకారులు ధన్యవాదాలు తెలిపారు.

నష్టం అంచనాకు కమిటీ

నష్టం అంచనాకు మత్స్యశాఖ కమిషనర్ చైర్మన్ కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్ఐఎఫ్‌టీ) ప్రిన్సిపాల్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, కాకినాడ పోర్టు అధికారి, విశాఖపట్నం ఆంధ్రా వర్సిటీ మెరైన్ బయోలజిస్టు, విశాఖ సీఎంఎఫ్ఆర్ఐ ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి, ఓఎన్‌జీసీ జియోఫిజికల్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓఎన్‌జీసీ కేజీ బేసిన్– డీడబ్ల్యూఎన్–98/2 ప్రాజెక్టు మేనేజర్లను నియమించారు.


ఓఎన్‌జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటున్న మత్స్యకారులు (ఫైల్)

సానుకూల స్పందన

ఓఎన్‌జీసీ కార్యకలాపాల నేపథ్యంలో కాకినాడ పరిసర గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న మత్స్యకార ప్రతినిధుల డిమాండ్‌కు ఓఎన్‌జీసీ అధికారులు సానుకూలంగా స్పందించారు. జిల్లా యంత్రాంగం ద్వారా ఈ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మత్స్యకార యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. సమావేశంలో ఢిల్లీలో ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులైన ఆఫ్‌షోర్ ప్రొడక్షన్ డైరెక్టర్ పంకజ్ కుమార్, సంస్థ అడ్వైజర్ ఏకే శ్రీవాత్సవ, కాకినాడ ఆఫ్‌షోర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ పి.సురేష్ బాబు, కేఎస్‌పీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, మత్స్యశాఖ జేడీ కె.కరుణాకర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

రాజానగరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గండేపల్లి మండలం ఎస్టీ రాజాపురానికి చెందిన పిల్లి లోవకుమారి (36), భర్త దుర్గారావుతో కలిసి సోమవారం వైద్యం కోసం మోటారు సైకిల్‌పై జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చింది. అనంతరం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా తూర్పుగానుగూడెం వద్ద వారిని వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో లోవకుమారి అక్కడికక్కడే మృతి చెందగా, దుర్గారావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి 18, 15 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. లారీ అతివేగంగా రావడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టూరిస్టు బస్సు యాత్రికులకు విశ్రాంతి షెడ్లు


దేవస్థానం కళాశాల మైదానంలో నిర్మించిన విశ్రాంతి షెడ్లు


షెడ్డులో సేద తీరుతున్న భక్తులు

- అన్నవరంలో రూ.కోటితో నిర్మాణం
- సేద తీరడంతో పాటు వంట చేసుకునే వసతి

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి టూరిస్టు బస్సుల్లో వస్తున్న భక్తులకు కొండ దిగువన దేవస్థానం కళాశాల మైదానంలో విశ్రాంతి షెడ్లు ఏర్పాటు చేశారు. ఇవి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. గతంలో టూరిస్టు బస్సుల్లో వచ్చిన వారందరూ చెట్ల నీడన విశ్రాంతి తీసుకునేవారు. ఇప్పుడు అన్ని వసతులతో కూడిన ఈ షెడ్లు ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి వచ్చాయి. ప్రతి రోజూ సత్యదేవుని సన్నిధికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. వీరిలో ఉత్తరాది రాష్ట్రాల భక్తులతో బాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వారు టూరిస్టు బస్సుల్లో చేరుకుంటారు. ఈ బస్సులను దేవస్థానం కళాశాల మైదానంలో నిలిపివేసి రత్నగిరికి వెళ్లి, సత్యదేవుని దర్శించి వచ్చేవారు. ఏడాది క్రితం వరకు అక్కడ ఎటువంటి సదుపాయాలు ఉండేవు కాదు. భక్తులందరూ ఆ బస్సుల్లో, నేల మీద దుప్పట్లు పరుచుకుని విశ్రాంతి తీసుకునేవారు.

రూ.కోటితో ఐదు షెడ్లు

2023 మార్చిలో దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ దేవస్థానం మైదానంలో రూ.కోటి వ్యయంతో ఐదు విశ్రాంతి షెడ్లను నిర్మించారు. వాటిలో భక్తులు విశ్రాంతి తీసుకోవడంతో పాటు వంటలు చేసుకునే ఏర్పాట్లు కూడా చేశారు. ఈ షెడ్లను ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి తెచ్చారు. భక్తులు వేచి ఉండేందుకు రోడ్డు పక్కన నిర్మించిన ఓపెన్ షెడ్డు కూడా చాలా ఉపయోగపడుతోంది. ఈ విశ్రాంతి షెడ్ల నిర్వహణ, భక్తులకు దేవస్థానం సమాచారం చెప్పేందుకు ఒక ఉద్యోగిని ఈఓ కె.రామచంద్రమోహన్ నియమించారు.

ఘాట్ రోడ్డు నుంచి మెట్ల దారి



టూరిస్టు బస్సుల్లో వచ్చే భక్తుల కోసం విశ్రాంతి షెడ్లలో అన్ని ఏర్పాట్లు చేశాం. వీరు స్వామివారి ఆలయానికి కాలినడకన వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మెట్లదారి కొంచెం దూరంగా ఉంది. అందువల్ల ఘాట్ రోడ్డు నుంచి రెండో మెట్లదారి నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇది టూరిస్టు బస్సులలో వచ్చే వారితో బాటు ఇతరులకూ సౌకర్యంగా ఉంటుంది.

– కె.రామచంద్రమోహన్, ఈఓ

వివాహిత అదృశ్యం


అఖిలాండేశ్వరి (ఫైల్)

కిర్లంపూడి: మండల పరిధి గోనేడ గ్రామానికి చెందిన పట్టిశం అఖిలాండేశ్వరి అదృశ్యమైంది. ఆమెకు ఫిబ్రవరి 14న ఒడిశాకు చెందిన గోపాలకృష్ణతో వివాహం జరిగింది. ఇటీవల గోనేడలోని పుట్టింటికి వచ్చిన ఆమె ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఆమె సోదరుడు శివ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై షేక్ జబీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అఖిలాండేశ్వరి ఆచూకీ తెలిసిన వారు 94407 96529, 94409 04834 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పిచ్చికుక్క దాడిలో పదిమందికి గాయాలు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దీని దాడిలో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. రెండున్నరేళ్ల బాలుడి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ గాయపడిన వారిలో ఉన్నారు. అలాగే రెండు ఆవులు, ఒక కోడిపుంజును సైతం కుక్క గాయపరిచింది. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ కుక్కను వెంబడించి హతమార్చారు. అనంతరం గాయపడిన వారిని గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెండున్నరేళ్ల బాలుడికి తలపై చెవి భాగంలో తీవ్రగాయం కావడంతో ప్రథమ చికిత్స అందించిన మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్జిత సేవగా సత్యదేవుని రథోత్సవం


నూతన రథంపై సత్యదేవుడు, అమ్మవారు (ఫైల్)

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న సత్యదేవుని రథోత్సవాన్ని ఆర్జిత సేవగా మార్పు చేస్తూ రూ.2,500 రుసుం నిర్ణయించినట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ సోమవారం తెలిపారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అమ్మవారిని ప్రతి ఆదివారం ఉదయం పది గంటలకు నూతన రథంపై మూడుసార్లు ఊరేగిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఊరేగింపు ఆర్జిత సేవలో పాల్గొనేందుకు రూ.2,500 టిక్కెట్ నిర్ణయించారు. ఒక టిక్కెట్‌పై నలుగురు కుటుంబ సభ్యులను అనుమతిస్తారు. వారికి కండువా, జాకెట్ ముక్క, ప్రసాదం అందజేస్తారు. స్వామివారి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం చేయిస్తారు. ఈ నెల ఏడో తేదీన ఈ మేరకు దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. ఆ తీర్మానానికి కమిషనర్ ఆమోదముద్ర వేశారు. ఈ నెల 24వ తేదీ (ఆదివారం) నుంచి అమలులోకి రానుంది.

అమ్మ త్యాగానికి సెల్యూట్..


అమ్మకు సెల్యూట్ చేస్తున్న మధు, మాధవ్

యానాం: అమ్మ అంటే ప్రేమ, నాన్న అంటే ఓ నమ్మకం. పిల్లల ఎదుగుదల వెనుక వాళ్లద్దరి కష్టం ఉంటుంది. ఆ ఎదుగుదలకు కారణమైన ఆ తల్లిదండ్రులకు పిల్లలు ఎప్పుడూ రుణపడి ఉండాల్సిందే. వారిది మధ్యతరగతి కుటుంబం. అనుకోని పరిస్థితుల్లో కుటుంబ యజమాని తండ్రి మృతి చెందాడు. కానీ ధైర్యం కోల్పోకుండా ఆ తల్లి కుటుంబ భారాన్ని మోసింది. తన ఇద్దరు కొడుకులను శ్రద్ధగా చదివించింది. వారు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. అనంతరం ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. యానాం పోలీస్‌స్టేషన్‌లో ఒకే కుటుంబానికి చెందిన కడలి మధు, మాధవ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి పుదుచ్చేరి పోలీస్ శాఖ ప్రకటించిన పదోన్నతులతో ఏఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఏఎస్సై యూనిఫాంలో వచ్చి తమ అమ్మకు సెల్యూట్ చేస్తూ పొంగిపోయారు.